యూపీ పాఠశాలలకు మంగళం

- నియోజకవర్గంలో కనుమరుగవనున్న ఐదు యూపీ పాఠశాలలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- ఆవేదనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



డీ గ్రేడ్ కానున్న శరభవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల

ప్రత్తిపాడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవుగా ప్రాథమికోన్నత పాఠశాల విద్యకు పాతరేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే కార్యాచరణ పూర్తి కాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమికోన్నత పాఠశాలలకు మంగళం పాడేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తూ సర్కారు బడులను నిర్వీర్యం చేసేందుకు రంగం సిద్ధం చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తొలుత మండల పరిషత్ ప్రాథమికోన్నత(యూపీ) పాఠశాలలకు మూసివేసేందుకు కార్యాచరణ చేపట్టింది. అయితే గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ బడిని వేలాది రూపాయలు హెచ్చించి బాగుచేసింది. ఆధునిక హంగులు కల్పించి, కార్పొరేట్‌కు దీటుగా నిలబెట్టింది. ఆంగ్ల విద్యతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌ను అందుబాటులోకి తెచ్చింది. సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా సంస్కరణలు అమలు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వారికి ప్రభుత్వ విద్యను దూరం చేసేలా అడుగులు వేస్తోందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రాథమికోన్నత పాఠశాలలకు చెల్లుచీటి

సర్కారు నిబంధన వల్ల ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలలోని ఐదు పాఠశాలలను స్థాయి తగ్గించి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలుగా మారనున్నాయి. ఈ యూపీ పాఠశాలల్లోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను సమీప గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హైస్కూల్)లో విలీనం చేస్తారు. రౌతులపూడి మండలంలోని యూపీ పాఠశాలల్లో 'గిడజాం' (ఈ పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను ఎస్.అగ్రహారం హైస్కూల్‌లోకి), 'ఎ.మల్లవరం' (ఈ పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను బలరామపురం హైస్కూల్‌లోకి), శంఖవరం మండలంలోని 'వజ్రకూటం' (ఈ పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను కత్తిపూడి హైస్కూల్‌కి), ప్రత్తిపాడు మండలం 'రౌతుపాలెం' (ఈపాఠశాలలోని 6, 7 తరగతుల విద్యార్థులను లంపకలోవ హైస్కూల్‌కి), 'శరభవరం' (ఈ పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను గజ్జనపూడి హైస్కూల్‌కి) యూపీ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా మారనున్నాయి. కాగా ప్రత్తిపాడు మండలం టి.రాయవరం యూపీ పాఠశాల విద్యార్థులను ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోకి చేర్చేందుకు జాతీయ రహదారి అడ్డంకిగా మారింది. అందు చేత టి.రాయవరం పాఠశాలతో పాటు రౌతులపూడి మండలంలోని ఎస్ఎస్ పట్నం, రాజవరం, ఎస్.పైడిపాల పాఠశాలలను యథాతథంగా కొనసాగనున్నాయి. ఏలేశ్వరం మండలంలోని మర్రివీడు, పేరవరం, తూర్పు లక్ష్మీపురం, సి.రాయవరం, యర్రవరం, ప్రత్తిపాడు మండలంలోని పోతులూరు, పెద్దిపాలెం, రౌతులపూడి మండలంలోని పారుపాక, శంఖవరం మండలంలోని కె.కొత్తూరు యూపీ పాఠశాలలు హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేసేందుకు విద్యాశాఖాధికారులు ప్రతిపాదించినట్టు సమాచారం.

ప్రభుత్వ నిబంధనలివి

- యూపీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదువుతున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 30 లోపు ఉంటే ఆ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా డీ గ్రేడ్ చేయాలి.
- 30-59 మధ్య విద్యార్థుల సంఖ్య ఉంటే ఆయా పాఠశాలలకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నత పాఠశాలలుంటే వాటిని ఆయా హైస్కూల్‌లో విలీనం చేయాలి.
- విద్యార్థుల సంఖ్య 60 పైబడి ఉంటే వాటిని ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలనేది ప్రభుత్వ నిబంధన

యూపీ స్కూల్‌ను రద్దు చేయడం తగదు



మా రౌతుపాలెం పాఠశాలలో 6, 7 తరగతులున్నాయి. 8వ తరగతి ప్రారంభించాల్సి ఉండగా యూపీ పాఠశాలనే రద్దు చేయడం తగదు. పాఠశాల నుంచి లంపకలోవ హైస్కూల్‌కి వెళ్లాలంటే 4 కిలోమీటర్ల దూరం నడవాల్సిందే. దీని వల్ల హైస్కూల్ విద్యకు విద్యార్థులు దూరం అవుతారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలి. మా గ్రామంలోని యూపీ పాఠశాలలో 8వ తరగతిని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలి. మా గ్రామంలో డ్రాప్ అవుట్స్‌ని నివారించాలంటే ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాల్సిందే.

– కొంగన కుమార్, రౌతుపాలెం, ప్రత్తిపాడు మండలం

ప్రభుత్వ కుట్ర



ప్రభుత్వం యూపీ పాఠశాలలను ఎత్తి వేసేందుకు రంగం సిద్ధం చేసింది. కొన్నింటిని విలీనం చేసి, మరికొన్నింటిని మూసివేత దిశగా అడుగులు వేస్తోన్నట్టు తెలుస్తోంది. దీని వల్ల విద్యార్థులు ఉన్నత పాఠశాల విద్యకు దూరమవుతారు. యూపీ పాఠశాలలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కార్పొరేట్ పాఠశాలకు వత్తాసు పలికేందుకు ప్రభుత్వ కుట్రలో భాగంగానే యూపీ పాఠశాలలను ఎత్తివేసే ప్రయత్నమిది. దీన్ని వ్యతిరేకిస్తాం.

– రొంగల ఈశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి, ప్రత్తిపాడు.

క్లుప్తంగా

నేడు చలో విజయవాడ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

తుని: ఏపీ ట్రాన్స్‌కోలో విద్యుత్ మీటర్ల రీడర్లగా పని చేస్తోన్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని గురువారం విజయవాడలో నిర్వహించనున్న మహా సభను జయప్రదం చేయాలని జగ్గంపేట డివిజన్ యూనియన్ అధ్యక్షుడు పసగడుగుల నానాజీ కోరారు. బుధవారం తుని వీరవరపుపేట సబ్‌స్టేషన్‌లో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మీటర్ల రీడర్లగా 4500 మంది పని చేస్తున్నారని, స్మార్ట్ మీటర్లు అమల్లోకి వస్తే ఉపాధి కోల్పోతారని, వీరి మీద ఆధార పడిన కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విద్యుత్ కార్మికుల యూనియన్ నాయకులు పి.నూకరాజు, సతీష్, బీరా శ్రీను, తమ్మారావు, పి.చిన్ని, అలీషా, చలం, ఏసు, రాజేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



కోటనందూరు హైస్కూల్లో ఉపాధ్యాయులతో చర్చిస్తున్న పీవో వేణుగోపాలరావు

కోటనందూరు: పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సమగ్రశిక్ష పీఓ పీ వేణుగోపాలరావు సూచించారు. పీఎంశ్రీ పథకంలో ఎంపికైన స్థానిక జెడ్పీ హైస్కూలును బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. పూర్తయిన పనులకు వెంటనే నిధులు విడుదల చేస్తామన్నారు. పాఠశాల స్థితిగతులు, పదో తరగతి విద్యార్థుల విద్యాబోధనపై హెచ్ఎం రామకృష్ణను ఆరా తీశారు. అనంతరం స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి అక్కడ ఎంఈఓ శ్రీనివాసు, సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామశేఖర్, సీఆర్పీ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి వైద్య విభాగం ప్రారంభం



ఆసుపత్రిలో కంటి విభాగాన్ని ప్రారంభిస్తున్న వ్యాపారవేత్త మల్లికార్జున

తుని: స్థానిక శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగాన్ని ప్రముఖ వ్యాపార వేత్త చెక్కా మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. నేత్ర వైద్య విభాగంలో డాక్టర్ ఎంపి సుమయ్య ప్రధాన వైద్యురాలిగా ఉండి వైద్య సేవలు అందిస్తారని ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ విభాగంలో నేత్ర వైద్యానికి కావల్సిన అన్ని సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ ఫౌండర్, ట్రస్టీ సీహెచ్‌వీకే నరశింహారావు, సీఈఓ సాయిగ్రాం, డాక్టర్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, తుని, పాయకరావుపేటకు చెందిన ప్రముఖులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

24న మండల సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఈనెల 24న మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధిపై సమీక్ష జరుగుతుందని, మండల స్థాయి అధికారులందరూ సంబంధించిన శాఖలో పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అందరూ ఎంపీటీసీలు, సర్పంచేలు హాజరుకావాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు.

భవిత సెంటర్‌కు కుర్చీల వితరణ



భవిత సెంటర్‌కు కుర్చీలు బహూకరిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం భవిత సెంటర్‌కు ఉపాధ్యాయుడు సలాది సత్యనారాయణ తల్లి వీర రాఘవమ్మ జ్ఞాపకర్థంగా బుధవారం కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా భవిత సెంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించి కొద్దిసేపు వారితో గడిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ చామంతి నాగేశ్వరావు, ఎంఈఓ వి.రాజబాబు, ఎఈఓ-2 వై అచ్చిరాజు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, భవిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించకుంటే చర్యలు

స్టేట్ రిసోర్స్ పర్సన్ సింహాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ సింహాద్రి

తుని రూరల్: ఈనెల 20వ తేదీ నుంచి తుని మండలంలో నిర్వహించనున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌కు సహకరించని సిబ్బందిపై చర్యలు తప్పవని స్టేట్ రిసోర్స్ పర్సన్ సింహాద్రి పేర్కొన్నారు. బుధవారం తుని మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ పసుపులేటి నారాయణరావు అధ్యక్షతన సోషల్ ఆడిట్ బృందానికి, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఆర్‌పీ సింహాద్రి మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధి పనులకు సోషల్ ఆడిట్ క్షేత్రస్థాయిలో జరుగుతుందన్నారు. అవసరమైన రికార్డులు అందించడంతో పాటు క్షేత్రస్థాయిలో చేసిన పనులను చూపించడంలో సంబంధిత సిబ్బంది సహకరించాలన్నారు. రూ.14,96,71,010 విలువైన 24 రకాల పనులు జరిగాయన్నారు. ఎవరి ఒత్తిళ్లకు తావివ్వకుండ సోషల్ ఆడిట్ పారదర్శకంగా నిర్వహించాలని ఆడిట్ బృందాలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామ సభలు నిర్వహించవద్దన్నారు. ఎవరైన ఫిర్యాదులు ఇస్తే సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. మండల స్థాయిలో మార్చి నాలుగైదు తేదీల్లో సోషల్ ఆడిట్ నివేదిక బహిరంగంగా వెల్లడిస్తామన్నారు. ఈఓపీఆర్‌డీ డి.మరిడియ్య, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు రుకార్ట్ సబ్జీ కూలర్లు



తేటగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ విజయలక్ష్మి

తుని రూరల్: కూరగాయలు, పండ్లు, పూలు పండించే రైతులకు, విక్రయించే వ్యాపారులకు రాయితీపై రుకార్ట్ సబ్జీ కూలర్లను అందిస్తున్నట్టు ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. తేటగుంట రైతు సేవా కేంద్రంలో ఆమె రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 7 లేయర్ల ఎవాపోరేటివ్ కూలింగ్ టెక్నాలజీతో రూపొందించిన కూలర్లను 50 శాతం రాయితీపై అందిస్తున్నట్టు వివరించారు. కూరగాయలు, పండ్లు, పూలు పండిచిన తర్వాత మార్కెట్‌కు తరలించడం, విక్రయించడంలో ఎదురయ్యే ఇబ్బందులను రైతులు అధిగమించవచ్చన్నారు. తాజాదనం కోల్పోకుండా ఈ కూలర్లలో మూడు రోజులు వరకూ నిల్వ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ సరఫరా అవసరం లేకుండానే పని చేస్తాయన్నారు. రాయితీ మినహాయించి లబ్ధిదారు వాటా చెల్లిస్తే సబ్జీ కూలర్లను సరఫరా చేస్తామన్నారు. 25 కిలోల సామర్థ్యం గల కూలర్ల ధర రూ.21వేలు ఉండగా రాయితీ రూ.10,500 లభిస్తుందన్నారు. 50 కిలోల సామర్థ్యం గల కూలర్లు రూ.39,900లకు రూ.19,950, వంద కిలోల సామర్థ్యం ఉన్న కూలర్లు రూ.57వేలలో రూ.28,500 చొప్పున చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన అధికారులను, వీహెచ్ఏలను సంప్రదించాలన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతను సాధించాలి



కేజీబీవీలో విద్యార్థుల గ్రేడింగ్ రికార్డులు పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ వేణుగోపాల్

తొండంగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహిస్తున్న కేజీబీవీల్లో టెన్త్, ఇంటర్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్లానింగ్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం వాకదారిపేటలో కేజీబీవీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, డిజిటల్ విద్యాబోధన, మెనూ ప్రకారం భోజనం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అదేవిధంగా అదనపు తరగతి గదుల నిర్మాణం, కంప్యూటర్, లైబ్రరీ ఏర్పాటు తదితర మేజర్, మైనర్ సివిల్ వర్కులకు సంబంధించి రూ.10 లక్షలు మంజూరు కాగా 25 శాతం నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఏర్పాటు కానున్న మౌలిక వసతుల కల్పన కోసం డీఈ నాగమోహన్‌తో చర్చించారు. నిర్మాణ పనులను పరిశీలించి ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ రాజేశ్వరీ, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి



ఏలేశ్వరంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పరిషత్ ప్రతినిధులు

ఏలేశ్వరం: చరిత్ర గర్వించదగ్గ యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక మార్స్‌కంప్యూటర్స్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకటప్రసాద్, కటకం కిరిటీ మాట్లాడుతూ హిందూ సామ్రాజ్యాన్ని పరిరక్షించడంలో శివాజీ చేసిన సేవలు అపూర్వమన్నారు. శివాజీని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎన్నితరాలు మారిన శివాజీ పోరాట పటిమ హిందువులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మార్స్‌కంప్యూటర్స్ నిర్వాహకుడు అడపా దుర్గారావు, ఉడతల రమణారావు, గొల్లపూడి సత్యనారాయణ, వాగు కామబాబు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మహోన్నతుడు శివాజీ

జగ్గంపేట: దేశం గర్వించదగ్గ మహోన్నతుడు శివాజీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా విస్తృత పర్యటనలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌ను ఇర్రిపాకలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలియజేశారు. శివాజీ జయంతి సందర్భంగా సాహితీ స్కూల్ నందు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యక్తులపై కేసు



కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్సై టీ రామకృష్ణ బుధవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నర్సీపట్నం నుంచి తుని వైపు బొలెరో వాహనంలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండడాన్ని గమనించిన డ్రైవర్ వాహనాన్ని వెనుకకు మళ్లించాడు. దీంతో ఎస్సై తన సిబ్బందితో వెంబడించి వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఆరు ప్లాస్టిక్ డ్రమ్ములలో కోళ్ల వ్యర్థాలు దుర్వాసన వెదజల్లుతూ కనిపించాయి. ప్రజారోగ్యానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న జగ్గంపేట మండలం, ఇర్రిపాక గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ ముంగర బాలాజీ, పిఠాపురం జగ్గయ్య చెరువుకు చెందిన అతని సహాయకుడు కరకాటి సహదేవుడులను అదుపులోకి తీసుకున్నారు. కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఘనంగా భాషా దినోత్సవం



పెరుమాళ్లపురం గడ్డిపేట జెడ్పీ హైస్కూల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తొండంగి: పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో బుధవారం భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం చాత్రాతి.వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో హిందీ, ఇంగ్లిష్, తెలుగు భాషా ఉపాధ్యాయులతో భాషల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా ఛత్రపతి శివాజి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు శివాజీ జీవిత చరిత్రను వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు జాకీర్ ఇస్మాయిల్, సత్యనారాయణరాజు, శ్రీహరి, శేషుకుమారి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మోటారుసైకిల్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మృతదేహాన్ని పక్కకు తరలిస్తున్న గన్‌మెన్, హైవే అంబులెన్స్, రోడ్డు సేఫ్టీ సిబ్బంది

గండేపల్లి: జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... మల్లేపల్లికి చెందిన చల్లా సత్యనారయణ(39) ఏలేశ్వరం మండలం యర్రవరానికి చెందిన సిక్కిరెడ్డి దుర్గారావు మోటారుసైకిల్‌పై రాజానగరం వెళ్లి తిరిగి జగ్గంపేట వస్తుండగా నీలాద్రిరావుపేట చక్రవర్తినగర్ వద్ద జంగారెడ్డిగూడెం నుంచి ఒమ్మంగి వెళుతున్న కారు వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. దుర్గారావు తీవ్ర గాయాలయ్యాయి. ఇతనిని హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు సత్యనారాయణకు భార్య, పిల్లలు ఉన్నారన్నారు. చక్రవర్తినగర్‌కు సమీపంలో ఉన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గన్‌మెన్ శ్రీను ప్రమాద స్థలం వద్దకు చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పంచానామ నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించినట్టు తెలియజేశారు.

ఏలేశ్వరంలో ఎన్నికల ప్రచారం

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 1, 18, 20 వార్డులో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు , జనసేన నాయకుడు పెంటకోట మోహన్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థికి విజయం చేకూర్చాలంటూ ప్రత్తిపాడులో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ పరిశీలకుడు మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేశారు.

జగ్గంపేట: తనను గెలిపిస్తే నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానని జీవీ సుందర్ తెలియజేశారు. జగ్గంపేట క్షత్రియ ఫంక్షన్ హాల్‌తో బుధవారం జరిగిన దైవ సేవకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జగ్గంపేటలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానన్నారు.

జ్ఞాన జ్యోతి శిక్షణతో మేలు

గండేపల్లి: శిక్షణ ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు గండేపల్లి జెడ్పీ స్కూల్‌లో జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతుల్లో బుధవారం ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలన్నారు.

కార్మిక సభ్యులు సంఘటితం కావాలి

జగ్గంపేట: కార్మిక వర్గ రాజ్య స్థాపన కావాలంటే విప్లవకారుల ఐక్యత అత్యంత ఆవశ్యకమని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యేసు పేర్కొన్నారు. జగ్గంపేట భగత్ సింగ్ నగర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం రాష్ట్ర కమిటీల కరపత్రాలను ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

ఆటలో పాల్గొన్న పోలెండ్ దేశస్తులు



భజన మండలి సభ్యులతో కలిసి కోలాటం ఆడుతున్న పోలెండ్ దేశస్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన బుధవారం అనకాపల్లి పట్టణానికి చెందిన కన్యకాపరమేశ్వరి దేవస్థానం శ్రీహరి భజన మండలి మహిళా సభ్యులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీరు అనేక భక్తి గీతాలకు కోలాటం చేశారు.కాగా పోలెండ్ దేశస్తులు రత్నగిరి సత్యదేవుని ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించారు. వీరు ఈ కోలాట ప్రదర్శనను తిలకించి చాలా సంతోషం వ్యక్తం చేశారు. వారు కూడా ఈ కోలాటంలో పాల్గొని ఆ మహిళలతో సమానంగా ఆడారు.

సింహాచలం కుటుంబానికి ముద్రగడ పరామర్శ



ఎ.మల్లవరంలో సింహాచలం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

రౌతులపూడి: ఎ.మల్లవరంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కాకి సింహాచలం కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం పరామర్శించి ప్రాగడ సానుభూతిని తెలిపారు. బుధవారం సింహాచలం స్వగృహానికి వెళ్లి సింహాచలం తనయుడు బాబురావును, రామకృష్ణను పరామర్శించారు. సింహాచలం కుటుంబంతో ఎంతో కాలంగా స్నేహపూర్వకంగాను, రాజకీయంగాను ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబానికి తీరని నష్టమన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చిన్నదివానం, పార్టీ వైఎస్సార్ సీపీ నేత వాసిరెడ్డి జమీలు, పార్టీ జిల్లా కార్యదర్శి కాకి నాని, మాజీ సర్పంచ్ నాకిరెడ్డి అప్పలనాయుడు, సోమరౌతు, తిరుమల వెంకన్న దొర, అంకంరెడ్డి సతీష్‌కుమార్, న్యాయవాది కాకి చిట్టిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి గ్రామానికి చెందిన సుంకర వెంకన్న ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుటుంబ సమేతంగా పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ముద్రగడ సతీమణి పద్మావతి, పార్టీ నియోజకరవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన పిల్లా చిట్టిబ్బాయిని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం బుధవారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో పిల్లా చిట్టిబ్బాయి కుమారుడు పిల్లా సీతయ్య మృతి చెందిన సంఘటన తెలిసిందే. సీతయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, పార్టీ నాయకులు శేరు కృష్ణ, గుడాల వెంకటరత్నం, సలాది కృష్ణ, గోళ్ళ జయశేఖర్, చల్లా సత్యనారాయణ, పీఎంపీల సంఘ ప్రతినిధి డాక్టర్ అందే చిట్టికొండ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

శివకేశవులను దర్శించుకున్న ప్రముఖులు

గండేపల్లి: ఇర్రిపాకలో ఏలేరు నది తీరాన ఇటీవల ప్రతిష్టించిన శివ కేశవులను బుధవారం రాష్ట్ర అటవీశాఖ చైర్మన్ సృజన కృష్ణ రంగారావు, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కూడా చైర్మన్ తుమ్మల బాబు, జగ్గంపేట జెఎస్పీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్‌లు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఎమ్మెల్యే, టీటీడీ సభ్యులు జ్యోతుల నెహ్రూ ఘనంగా స్వాగతం పలికారు. రాజమహేంద్రవరం అర్బన్ అథారిటీ చైర్మన్ బొడ్డు వెంటకరమణ చౌదరి దర్శించుకున్నారు.

డిగ్రీ, పీజీ విద్యార్థులకు వర్క్‌షాప్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు బుధవారం వర్క్‌షాప్ నిర్వహించినట్టు కళాశాల డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ సర్టిఫైడ్ ట్రైనర్ వి.నరేంద్ర రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ఇన్వెస్టర్స్ పెట్టుబడి పెట్టడం ద్వారా ఆర్జించే లాభాలు, మారుతున్న కాలానుగుణంగా మానేజ్‌మెంట్ విద్యార్థులు ఇన్వెస్ట్‌మెంట్ రిస్క్, రిటర్న్ వంటి వాటిలో పరిజ్ఞానం ఆర్జించినప్పుడే లాభదాయకంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ విజయ భార్గవి, మానేజ్‌మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.